(ఆత్మకథాత్మిక కథన రీతి)

కథ

# స్వేచ్ఛ అంటే ఏమిటి?

**జయంతి పాపారావు**

పదవీ విరమణ చేసేశాను. ఎక్కడెక్కడో ఉద్యోగం చేసి, మా విశాఖ చేరుకున్నాను. విశ్రాంత జీవితంలో ప్రవేశించాను. ఎన్నో ఏళ్ళు గడిపిన విశాఖ నాకు కొత్తగా ఉంది. విశాఖకు నేను కొత్తగా ఉన్నాను! నేను కొత్త మనిషినా? నాలోకి నన్ను చూసుకున్నాను! ఎన్నో ఏళ్లు ఎక్కడెక్కడో పని చేసి ఏమి సంపాదించాను?! నన్ను నేను కొత్తమనిషిగా చేసుకుని తిరిగొచ్చానా?!

విశ్రాంత జీవితంలో ప్రవేశించాక, ఈ ప్రశ్నలు తప్పవేమో! ప్రతిజాతి, బాగుకోసం, భవిష్య జీవనంలోకి దిశానిర్దేశం చేసుకుంటుంది. ఆ దిశలో గమనాన్ని సాగిస్తుంది. అది సంస్థకూ వర్తిస్తుంది; వ్యక్తికీ వర్తిస్తుంది. జీవితంలో ఏం చేయాలని నిర్ణయించుకుంటామో, ఏ విధంగా జీవించాలో కూడా అలాగే నిశ్చయించుకుంటాం. విద్యతో పాటే ఆ ప్రయాణం సాగుతుంది. నా విషయంలోనూ అదే జరిగింది. నేను చదువుకుంటున్నప్పుడు, మా తాతగారు నన్నో ప్రశ్న అడిగారు. స్వేచ్ఛ అంటే ఏమిటి? స్వేచ్ఛ ఏదీ పరిపూర్ణమైన స్వేచ్ఛగా ఎందుకుండదు? పరిపూర్ణమైన స్వేచ్ఛ ఏదైనా, ఎక్కడైనా ఉందా? ఎందుకు లేదు? నేను తడుముకున్నాను; తడబడ్డాను!

మా తాతగారు చెప్పారు. వ్యక్తి స్వేచ్ఛ-వ్యక్తివాద స్వేచ్ఛ-తోటి మనుషులకు హానికరం కాకూడదు; సమాజానికి హానికరం కాకూడదు. అందుకోసం, వ్యక్తి స్వేచ్ఛను - వ్యక్తివాద స్వేచ్ఛను-సమాజం నియంత్రిస్తుంది; నియమిస్తుంది. అదే సమయంలో ఆధిపత్యంకోసమో, అధికారం కోసమో, స్వార్థ ప్రయోజనాలకోసమో, నియంత్రణ నియమం విధిస్తే, ప్రజలకూ సమాజానికీ అవసరమైన స్వేచ్ఛ కోసం పోరాడాలి! ఈ రెండు విషయాలూ దృష్టిలో పెట్టుకుని, జీవనవిధానాన్ని స్వేచ్ఛగా స్వేచ్ఛాయుతంగా రూపు దిద్దుకోవాల్సి ఉంది.

మా తాతగారు చెప్పిన రెండు విషయాలూ బాగానే ఉన్నాయనిపించింది. అది అంత తేలిక్కాదని కూడ అనిపించింది. మాతాతగారు చెప్పిన జీవన విధానంలో ఓ గొప్పమేలు ఉంది. అది నేను ఇరవై ఏళ్ల వయసులోపలే తెలునుకున్నాను. నలుగురితోనూ నిర్మాణశీల అనుబంధం ఏర్పడింది. అంతటా పరిమళించే మల్లెపొదలా అలుముకుంది. జనం అందరూ ఇంచుమించుగ ఆర్థిక ఇబ్బందుల్లో కష్టాల్లో ఉన్నవాళ్లే; అందరితో కలిసి మెలిసి జీవించడం! భద్రతతో స్వేచ్ఛగా జీవించడం! ఎక్కడకు వెళ్లినా తెలిసిన మనుషులే; పిలిచి పలకరించే మనుషులే! మా ఊళ్లోనే కాకుండా, చుట్టుపక్కల పల్లె ప్రజలతో అనుబంధం! ప్రేమానురాగాలతో కూడిన అనుబంధం - భద్రత - వాటి మధ్య మరువజాలని స్వేచ్ఛాయుత జీవితం! అది ఇప్పుడు అక్కడాలేదు; ఎక్కడా లేదు! అది తిరిగిరాని జీవన సంపదేమో; జీవన సౌందర్యమేమో!

× × ×

ఇరవై ఏళ్లు వచ్చేసరికల్లా, ఆ జీవితానికి దూరమైపోయాను. ఆ అనుబంధానికి దూరమైపోయాను. విశాఖలో ఉద్యోగం వచ్చింది. మా ఊరికి అరవై మైళ్లే; అరువేల మైళ్లు వెళ్లిపోయాననిపించింది! ఏదో జీవితంలో పోగొట్టుకున్నానని పించింది. అనుబంధం నన్ను వెనక్కి లాగుతూ ఉండేది; కునకనిచ్చేది కాదు. రెండడుగులు వేస్తే, ఎవరో పలకరించే వాళ్లు; పట్టణంలో ఎవరిదారి వారిదే! ఎవరి పరుగు వారిదే!

విశాఖ నాకు కొత్తది కాదు; తెలిసిన వాళ్లు చాలా మంది ఉన్నారు. వాళ్లతో సంబంధం - తోటి ఉద్యోగులతో సంబంధం - ఇంటి చుట్టు పక్కల వాళ్లతో సంబంధం - పెరుగుతూ వచ్చింది.

కాలప్రవాహం గొప్పది. మనోప్రవాహం అంత కంటే గొప్పది. మనోయాత్రలో మార్పు వస్తుంది. కొంతకాలం ప్రతి ఆదివారం మా ఊరు

వెళ్లేవాణ్ని; తరువాత రెండు వారాలకోసారి; తదుపరి నెలకోసారి; ఆ తరువాత అలా అలా కాలంలో దూరం పెరుగుతూ వచ్చింది. తల్లిదండ్రులు పోయాక, ఎప్పుడో ఒకసారి వెళ్లేవాణ్ని; అందరినీ కలిసేవాణ్ని; వాళ్లు కొత్తగా కనిపిస్తున్నారు! భూములూ, ఆస్తులు, వ్యాపారాలూ ఉన్నవాళ్లే అక్కడ మిగిలేరు; శ్రమ ఆధారంగా బతికే జనం బతుకుతెరువుకోసం ఎక్కడెక్కడికో పోయారు; పోతున్నారు. విశాఖలో సంబంధాలు పెరుగుతూ వస్తున్నా, ప్రేమానురాగాలతో కూడిన అనుబంధం ఎక్కడ చూసినా కనిపించలేదు! ఆ అనుబంధం ఉండదేమో! అవసరాలకు అవసరమైన సంబంధాలే ఉంటాయేమో! బ్రతుకులో అవసరాల మేరకు సంబంధాలకు ప్రేమానురాగాలతో కూడిన అనుబంధాలకు – మధ్య ఎంత దూరం ఉంటుందో అప్పుడే కొద్దిగా నా మనసుకు తాకింది; తగిలింది. పాత జ్ఞాపకాలు పోయాయని చెప్పుకోలేను కానీ, అవి గాలిలో పొల్లులా ఎగిరిపోతూ ఉండేవి. వాటిలో ప్రేమానురాగాల తడి ఆరిపోతూ వస్తోంది. నా జీవన యాత్రలో – నా మనోయాత్రలో– ఆ మార్పుబాగానే కనిపిస్తోంది. మారని మనసు ఉండదేమో!

× × ×

విశాఖ మా ఊరికి చాలా దగ్గరి బంధువే. మా ఊళ్లో చదువుకోని వాళ్లతో దగ్గరి అనుబంధం ఉండేది; విశాఖలో చదువుకున్న వాళ్లతో దగ్గరి సంబంధాలు పెరిగాయి. ఎన్నో గొప్ప విషయాలు మాట్లాడుతారు. నిజజీవితంలో ఆ గొప్పతనం కనిపించదు. వ్యసనాల్లోకి పరుగుతీస్తున్న వాళ్లను చూసి, ఆశ్చర్యపోతూ ఉండేవాణ్ని! వ్యసనాలు లేని వాళ్లను కూడా వ్యసనాల్లోకి లాగుతూ ఉంటారు! అసహ్యం వేస్తూ ఉండేది! జీతం ఇంటి ఖర్చుకి – మరి వ్యసనాలు ఎలా తీర్చుకోవడం? అందుకోసం, అక్రమ అర్జనలోకి వెళతారు! ఇంట్లో-ఆరోగ్యకరమైన భార్య ఉండగా, రోజుకి పదిమందికి బతుకు తెరువుకోసం శరీరాన్ని అద్దెకిచ్చుకుంటున్న స్త్రీతో ఏం సుఖం దొరుకుతుంది?! యోనిలేని స్త్రీతో ఏం సుఖం దొరుకుతుంది?! శవంలో ఏ సుఖం దొరుకుతుంది; పొగతాగడమంటే, సజీవ దహనం! అందులో ఏం సుఖముంది?! మద్యం-మత్తు మందు-ల్లో శరీరాన్నీ, మనసునీ స్పృహ లేకుండా మరచిపోయి, ఇంట్లోనూ, విశ్రాంతి భవనాల్లోనూ, రోడ్ల మీద కూడా శవాల్లా పడి ఉండడంలో ఏం సుఖముంది?! అవేవీ లేకుండ, స్త్రీ సుఖంగా జీవించడంలేదా?! పురుషుడు ఆ విధంగా ఎందుకు జీవించలేడు?! ఎన్నో ప్రశ్నలు; ఎన్నెన్నో ప్రశ్నలు! ఎందర్నో అడిగాను, ఇంచుమించుగ, అందర్దీ ఒకటే జవాబు!

నువ్వు విశాఖలోనే చదివావు; చదువే చదివావు, జీవితాన్ని చదవలేదు! అందుకే, మొద్దులా మిగిలిపోయావు! పశువుకి గడ్డి మేయడం మాత్రమే తెలుస్తుంది; నువ్వూ ఆ బాపతే! అనుభవిస్తేనే ఆ సుఖాల్లోని సుఖం తెలుస్తుంది! జీవితం ఎందుకు?! అనుభవించడానికే! రా, అనుభవించు; అప్పుడు నీకే అంతా తెలుస్తుంది! వాళ్లకి దగ్గరైతే ఓ ప్రమాదం; దూరమైతే మరో ప్రమాదం! వాళ్ల మధ్య పనిచేయడం బాగానే నేర్చుకున్నాను. నేను వాళ్లకీ, వాళ్ల వ్యసనాలకీ కూడా లొంగిపోలేదు! నేనే గెలిచాను!

× × ×

జీవన విధానంలో మార్పులు కనబడుతున్నాయి. కష్టపడి, శ్రమించి, సంపాదించాలన్న విధానంపట్ల ఆసక్తి తపన తరిగిపోతూ వస్తోంది. తేలిగ్గా అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించడంలో వేట కనిపిస్తుంది. వ్యసన వ్యాపారాల్లో – దొంగ వ్యాపారాల్లో – భూ దురాక్రమణల్లో– జూదాల్లో – మోసాల్లో – ద్రోహాల్లో – ఆ విధంగా పలు నేరమార్గాల్లో చూస్తూ చూస్తుండగానే కొందరు కోట్లకు పడగలెత్తారు; ఎత్తుతున్నారు. దోపిడీయే అభివృద్ధి మార్గంగా చేసుకున్నారు. గ్రామస్థాయి నుంచి అన్ని స్థాయిల్లో వాళ్లే ప్రజాప్రతినిధులుగా దర్శనమిస్తున్నారు! వాళ్లతో దగ్గరి సంబంధాలున్న ఉద్యోగవర్గం కూడ బాగా బాగుపడుతున్నారు! మతిపోయే విషవలయం అంతటా కనిపిస్తుంది! చూస్తూ చూస్తుండగానే ఎంత విషాద పరిణామం! ప్రజలు నిస్సహాయులుగా కష్టాల్లో జీవించడానికి అలవాటు పడుతున్నారు. మా తాతగారు చెప్పిన మాట గుర్తుకొస్తుంది. వ్యక్తి వాద స్వేచ్ఛ మితిమీరిపోతే ఏం జరుగుతుందో, కళ్ల ముందు కనిపిస్తుంది!

× × ×

నాకు పదవి కుసింత పెంచి, మరోజిల్లాకి బదిలీ చేశారు. వెళ్లనా? ఒద్దా? ఆలోచనలో పడ్డాను. అనుభవజ్ఞుల్ని అడిగాను. అక్రమార్జన కావాలంటే ఇక్కడే ఉండొచ్చు; ఆ జబ్బు నీకులేదు; అందువల్ల ఎక్కడ ఎక్కువ జీతం ఒస్తే, అక్కడికే పోవడం మంచిది– అన్నారు. బాగానే చెప్పారు; అది నాకు నచ్చింది. అంతటా ఒకాలాగే ఉంది; విషవలయాలే! ఎక్కడైతేనేంటి?! నిజమైన అనుబంధాలు ఎక్కడాలేవు! అవసరాలకు అవసరమైన సంబంధాలే! వ్యవస్థ అలా ఉన్నప్పుడు, ప్రజలు మరోలా ఉండలేరు! విషవలయంలో పడి పనిచేయలేను కాబట్టి, శత్రువులు ఎక్కడా తప్పరు!ఇక్కడ మాత్రం లేరా?! నేను వెళ్లడానికే నిశ్చయించుకున్నాను.

నా మనసులో ఎంత మార్పు వచ్చేసిందో! మా ఊరునుంచి విశాఖ రావడానికి ఎంత బాధ పడ్డానో; ఎంత కాలం బాధపడ్డానో! ఇప్పుడా బాధ నాలో ఎందుకులేదు?! అవసరాలకు అవసరమైన సంబంధాలు; అంతే! అంతే! అంతే!

× × ×

ఉద్యోగంలో ఏళ్లతరబడి అనుభవం వచ్చింది. అన్ని చోట్లా ఉన్న ఇబ్బందులే అక్కడా ఉన్నాయి. అక్రమార్జన మార్గంలో లేను కాబట్టి సగం సమస్యలు వాటంతట అవే పోతాయి! శత్రుత్వాలు ఎక్కువగా అందులోనే ఏర్పడతాయి! అయితే, విషవలయంలో పడకపోవడం వల్ల కూడ శత్రుత్వాలు వస్తాయి; వీటి స్వభావం వేరుగా ఉంటుంది; వీటిని అధిగమించడం నేను నేర్చుకున్నాను! అందువల్ల అంత ఇబ్బందిలేదు!

మా ఊరు గురించి, ఇతర కుటుంబసభ్యుల గురించి, అంతగా తలపు రావడం లేదు! బుర్రలో ఖాళీ లేదు! బహుశా, అందువల్లనేనేమో! పెళ్లయిన కొంతకాలం నా భార్య సుఖాలే పంచింది, సమస్య పెంచలేదు. ఆమె ఎంతకాలం సహనంతో మౌనంగా ఉండగలదు?! పిల్లలు పుట్టాక, ఆమెకు నా మీద అధికారం పెరిగిపోతూ వస్తోంది; అది సహజమే; డబ్బు చాలకపోవడమే అసలు సమస్య! ఇంట్లో నదుపాయాలు లేకపోతే ఎంతకాలం భరిస్తుంది;! నా కంటే చిన్న ఉద్యోగాలు చేస్తున్న వాళ్ల ఇళ్లల్లో



హైదరాబాద్‌లో అక్కినేని నాగేశ్వరరావు 86వ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన అవార్డు బహూకరణ కార్యక్రమంలో యువ గాయకుడు యల్లాప్రగడ సూర్యకార్తీక్‌కు అక్కినేని నాగేశ్వరరావుగారు ప్రతిష్ఠాత్మకమైన అక్కినేని అవార్డును బహూకరించారు. చిత్రంలో సూర్యకార్తీక్, నాగేశ్వరరావు, డా॥ కె.వి. కృష్ణకుమారి, నటుడు కాదంబరి కిరణ్

ఎన్నో సదుపాయాలు; చీరలు; నగలు! అవి మాకు లేవు! ఎప్పుడూ నేలమీద తుంగచాప వేసుకు పడుకోవడ మేనా? పిల్లలకు జబ్బులు రావా? ఆమె అడగడంలో తప్పులేదు; అయితే, నేనేమీ చేయలేని పరి స్థితి. విషవలయం గురించి ఆమెకు చాలా చెప్పాను; చాలాసార్లు చెప్పాను, ఆమె విసుగెత్తి పోయింది.

అందరూ ఏ విధంగా బతుకుతున్నారో మీరూ అలాగే బతకాలి! అందరికీ అక్కర్లేనిది మీకు మాత్రం ఎందుకు?! ప్రశ్నలు ఎక్కువైపోతున్నాయి! నేను వాటికి లొంగిపోలేదు!

ఇంట్లో పరిస్థితి ఆ విధంగా ఉంటే ఉద్యోగంలో పరిస్థితి ఆ విధంగా లేదు; అంతకంటే విషాదంగా మారింది. ఎన్ని రాజకీయ పార్టీలున్నాయో, అన్ని కార్మిక సంఘాలొచ్చేశాయి; వాటి పనిని అవి చేయడం మానేశాయి; రాజకీయ పార్టీల పనిని చేస్తున్నాయి. రాజకీయపార్టీల్లో 'కుల ప్రాతిపదిక' వ్యూహంగా మారడం వల్ల, కార్మిక సంఘాల్లో కూడ అదే ప్రాతిపదిక వచ్చేసింది.

ఒక కార్మికసంఘం ఏమి కావాలంటుందో, మరో కార్మిక సంఘం అది వద్దంటుంది! ఒక కులం ఏమి కావాలంటుందో, మరో కులం అది వద్దంటుంది! పని సంస్కృతి-ఉత్పత్తి-కార్మికుల బాగు - సంక్షేమం గాలికే! అప్పుడప్పుడు నినాదాలు వినబడతాయి! ధర్నాలు కనబడతాయి!

కళ్లు మూసుకుని బతుకుదామన్నా, మార్పులు కంటబడకుండా ఉండవు. పని విషయాని కొస్తే డబ్బిచ్చి నిముషాల్లో పనులు చేయించు కుంటారు. అది చేయలేని వాళ్లు, కాళ్లు అరిగిపోయేలా తిరుగుతూ ఉంటారు. తిరిగి తిరిగి విసిగి వేసారి పోయి, ఏదో ఒక రోజున డబ్బిచ్చి చేయించు కుంటారు. లేదా మరింక లాభంలేదని రావడం మానేస్తారు! ప్రజలవద్దకు పాలన?!

ఇంట్లో ఒత్తిడి! ఉద్యోగంలో ఒత్తిడి! నేను మాత్రం లొంగిపోలేదు!

× × ×

వీడివల్ల మన పనులు జరగడం లేదు.. ఏదో కాస్త కుర్చీ ఎత్తుపెంచి, ఎక్కడికో విసిరేస్తే బాగుటుంది... అన్న ఆలోచన అంతటా ఒక్కసారిగా గుప్పుమంది. నిజానికి ఏదైనా పని జరుగుతోందంటే, అది నా వల్లేనని వాళ్లందరికీ తెలుసు! అయితే వాళ్లకి కావాల్సిన పని వాళ్లకు కావల్సిన విధంగా జరగడం లేదు! పిల్లల చదువులు పాడైపోతాయని వాడే కాళ్ల బేరానికి వస్తాడని కొందరనుకున్నారు. నేను చాలా సంతోషంగా వెళ్లిపోయాను. బొణిపి కట్టినట్లు, వాళ్ల తలలు తడుముకున్నారు!

శ్రమతో జీవించే వ్యక్తిలో ఓ శక్తి ఉంటుంది. శ్రమించి ప్రజలకు ఉపయోగపడేలా జీవించే వ్యక్తిలో ఓ నిగూఢ శక్తి ఉంటుంది. ఓ సంస్థ శక్తి - సమాజ శక్తి - ప్రజలశక్తి - అటువంటి వ్యక్తుల్లో ఉంటుంది. ఏ అధికారం లేని అతని చేతుల్లో ఎంతో ప్రజాస్వామ్య అధికారం ఉంటుంది. ప్రజాస్వామ్యంలో అదే నిజమైన అధికారం ఔతుంది!.. కొందరి జీవితాల్లో దీన్ని నేను చూసి తెలుసుకున్నాను!

నాలో చాలా మార్పు వచ్చేసింది. మా పల్లెటూరు.. తల్లిదండ్రులు.. కుటుంబసభ్యులు.. బంధువులు.. తెలిసినవాళ్లు.. అక్కడి ఆనాటి జీవితం... విశాఖ ... అక్కడి సంబంధాలు... అవేవీ నా మనసులో మెదలడం లేదు! ఇబ్బందుల్లో బతుకుతున్న పిల్లలు.. ఇబ్బందులు భరించలేక నన్ను నిలదీస్తున్న నా భార్య... వీళ్లే కనిపిస్తున్నారు!

× × ×

కాలం వేగంగా ప్రవహిస్తోంది. ఊహించని మార్పులు వచ్చేస్తున్నాయి! వచ్చిన మార్పులు చాలవన్నట్లు, పని విధానంలో మార్పులు వచ్చేస్తున్నాయి! ఉద్యోగులకు కూడ ఏదో రాజకీయ పార్టీతో దగ్గరి సంబంధాలు పెరుగుతున్నాయి. పైకి ఎలా కనిపిస్తున్నా, పార్టీల వారీగా చీలికలు వచ్చేస్తున్నాయి... ముఠాలు! పనిలో ఆ ప్రభావం లేకుండా ఎలా ఉంటుంది?! ఎవరికోసం, ఎందుకోసం ఇదంతా జరుగుతూ వస్తోందో తెలీని పరిస్థితి; తెలిసీ తెలీని పరిస్థితి; ఇదేంటి;! ప్రభుత్వ యంత్రాంగమా?! ప్రజల వద్దకు పాలనా?!

× × ×

కాలం జోరుజోరుగా ప్రవహిస్తోంది. మా అబ్బాయిలు స్వయం కృషితో పెద్ద చదువులు చదివారు. ఎంత నిజాయితీతో ఎంత శ్రమించి పనిచేసినా, గుర్తింపు లేనిచోట పనిచేయడమెందుకని అనుకున్నారో ఏంటో విదేశాల్లో మంచి ఉద్యోగాలు సంపాదించుకున్నారు. నేను పదవీ విరమణ చేశాను; విశాఖ చేరుకున్నాం. నేనేమి సంపాదించాను;! నేనేమి మోసుకొచ్చాను;! నా భార్య చెబుతుంది. " మన అబ్బాయిలు బాగా పైకి వచ్చారంటే, మిమ్మల్ని చూసేకదండీ; మీ వల్లే కదండీ!" అంటుంది. ఇబ్బందుల్లో గుర్తించలేని సత్యాన్ని సుఖాల్లోనూ, సుఖాల్లో గుర్తించలేని సత్యాన్ని కష్టాల్లోనూ గుర్తిస్తామేమో!

మాతాతగారు చెప్పిన రెండు విషయాలూ ఎక్కడా కనిపించలేదు. విశాఖలోనూ కనిపించలేదు! అందువల్లేనేమో విశాఖ నాకు కొత్తగా ఉంది! విశాఖకు నేను కొత్తగా ఉన్నాను.

## అమ్మ అమ్మే

యం.యస్.రాజు

నెల తప్పిందని,
తెలిసింది మొదలు
అందమైన ఆలోచనలతో
కొత్త కొత్త అనుభూతుల్ని
ఆస్వాదిస్తుంది
శిశువు సన్నగా, తన్నుకుంటున్నప్పుడు
తన్మయత్వమవుతుంది
ప్రసవ వేదనను
పంటిబిగిన దాచేస్తూ
ఆనందంతో పరవశిస్తుంది
కన్నబిడ్డ
అందగాడైనా, అవిటివాడైనా
అమృత హస్తాలతో
మురిపెంగా ఎత్తుకొని
హృదయానికి హత్తుకుంటుంది
ప్రేమాభిమానాల్ని
గోరుముద్దలుగా తినిపిస్తూ
చిటికెన వ్రేలు సాయంతో
నడక నేర్పిస్తూ
బంగారు భవిష్యత్‌కు
బాటలు వేయిస్తుంది
కన్నవాడే, కసాయివాడై
కన్నతల్లిని నరకబోతే
తెలిసీ తెలియని వయస్సని
జాలిపడుతుంది
తండ్రి మందలించబోతే
ఊరుకోవయ్య, వాడికేం తెలుసని
ఊరడిస్తూ, కొత్త ఊపిరి పోస్తుంది
తుది శ్వాసలోనూ
కొడుకెలా బ్రతుకుతాడో అని
అదే ధ్యాసగా, కొడుకే శ్వాసగా
బ్రతుకుతుంది.
తనువు చాలిస్తూ కూడా
ఎన్నెన్నో జ్ఞాపకాల దొంతర్ని
అపురూపపు సంపదగా అందిస్తుంది
ఎంత చెబితే తరుగుతుంది
ఎంత మరిస్తే మాత్రం మరుగవుతుంది
ఎంతైనా అమ్మ అమ్మే